క్లుప్తంగా

ప్రమాదరహిత డ్రైవర్‌గా శ్రీనివాసరావు



తెనాలి: స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషనులో జరిగిన రోడ్డు భద్రత మాసోత్సవాల్లో తెనాలి డిపోలో 33 సంవత్సరాలు పైబడి ఎలాంటి ప్రమాదం లేకుండా విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్ ఐ.శ్రీనివాసరావు (ఈ384649)ను 'ప్రమాద రహిత డ్రైవర్'గా గుర్తించి సత్కరించారు. తెనాలి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి బి.జనార్దనరావు చేతులమీదుగా సన్మానించి నగదు పారితోషకం అందజేశారు. శ్రీనివాసరావు గారికి ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఈపూరి విజయ్‌కుమార్, ఐ.రాజేష్ కన్నా, డిపో అధ్యక్ష కార్యదర్శులు కె.బాబు, ఎస్.సుధాకర్, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు డీడీఎస్ రావు, వి.జోషి బాబు కార్మికులు పాల్గొని శ్రీనివాసరావును అభినందించారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం



తెనాలిరూరల్: అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైన ఘటన తెనాలిలో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పట్టణంలో తూర్పు కాల్వకట్టపై నివసించే నక్కా జయప్రసాద్‌కు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. సమాచారం అందుకున్న తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ బాధితులకు ఓ దాత సాయంతో రూ. ఐదువేలు, నిత్యాసర సరుకులు, రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో వంట సామగ్రి అందజేశారు. ప్రభుత్వ పరంగా బాధితులకు మరింత సాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

రైలులో ప్రయాణికుడు మృతి



తెనాలిరూరల్: రైల్లో ప్రయాణికుడు మృతి చెందాడు. గూడూరు–విజయవాడ రైలులో గురువారం ప్రయాణిస్తున్న గుర్తు తెలియని ప్రయాణికుడు మృతి చెందాడన్న సమాచారంతో రైలు తెనాలి స్టేషన్‌కు చేరుకోగానే జీఆర్పీ పోలీసులు మృతదేహాన్ని రైలు నుండి దింపించారు. మృతుడి వయసు 45 నుండి 50 ఏళ్ల మధ్య ఉంటుంది. మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు. మృతుడి వద్ద టికెట్ లేదని, సెల్‌ఫోన్ ఉండడంతో దాని ఆధారంగా అతని వివరాలు సేకరించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.

శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం

భట్టిప్రోలు (కొల్లూరు): శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం మండలంలోని అద్దేపల్లిలో గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. 74వ శ్రీరామ నామస్మరణకోటి మహోత్సవాలను పునస్కరించుకొని అద్దేపల్లికి చెందిన శ్రీరామ నామస్మరణ ఆధ్యాత్మిక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు కొన్నిపాటి భాస్కరరావు పర్యవేక్షణలో జరిపిన వేదుకలలో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పట్టాభిషేక మహోత్సవాన్ని తిలకించారు. ఈసందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

భట్టిప్రోలు కో-ఆప్టెడ్ సభ్యుడిని తొలగిస్తూ ఆదేశాలు

భట్టిప్రోలు (కొల్లూరు): మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు గైర్హాజరవుతున్న కారణంగా భట్టిప్రోలు కో–ఆప్టెడ్ సభ్యుడిగా తొలగింపునకు జెడ్పీ సీఈఓ స్పీకింగ్ ఆర్డర్స్ ఇచ్చినట్లు ఎంపీడీఓ ఎస్వీ రమణ గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. వరుసగా మూడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు కో–ఆప్టెడ్ సభ్యుడు మహ్మద్ ఫిరోజ్ హాజరుకాని కారణంగా ఈ ఆదేశాలు వెలువడినట్లు ఆయన తెలిపారు. గత డిసెంబర్ 12న జరిగిన మూడో వ సర్వసభ్య సమావేశానికి ఆయన గైర్హాజరవడంతో, అదే నెల 13 నుంచి కో–ఆప్టెడ్ సభ్యుడిని పదవి నుంచి తొలగిస్తూ ఆదేశాలు అందినట్లు పేర్కొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత



నిజాంపట్నం: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని అడవులదీవి పంచాయతీ వీరంకివారిపాలెం రామమందిరం వద్ద గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మహిళలకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యార్లగడ్డ వెంకట రాంబాబు విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. నాయకులు యార్లగడ్డ మదన్‌మోహన్, గ్రామ పెద్ద వీరంకి రమణ తదితరులు పాల్గొన్నారు.

అటుకుల తయారీలో వారిదే పైచేయి!

శ్రీమద్భాగవతంలో శ్రీకృష్ణ స్వామికి ఇష్టమైనవి, బాల్యసఖుడు కుచేలుడి దారిద్రాన్ని పోగొట్టినవి ఏవీ అంటే అందరూ ఠక్కున చెప్పే మాట అటుకులే. 'మిత్రమా నా కోసం ఏమైనా తెచ్చావా? (మురహరుడు పిడికెండటుకులు / గర మెప్పంగ నారగించి...) అని తన ఉత్తరీయంలో ఓ మూలన చిన్న మూటలో అటుకులు కట్టుకు వచ్చిన కుచేలుడిని అడిగి మరీ తిన్న పరమాత్మ కథ అందరికీ తెలిసిందే. ఆ యుగంలోనే కాదు ప్రస్తుత కలియుగంలోనూ అటుకులకు ప్రాధాన్యత ఏం తగ్గలేదు. వీటిని తయారు చేస్తూ జీవనం సాగిస్తున్న వారూ లేకపోలేదు. అటువంటి అటుకుల తయారీదారులు ప్రకాశం జిల్లా నుంచి తెనాలి వచ్చి ఇక్కడ వ్యాపారం సాగిస్తున్నారు. వారి జీవన విశేషాలను ఓమారు పరిశీలన చేస్తే...

- ప్రకాశం జిల్లా నుంచి తెనాలికి వలస
- మూడునెలలపాటు జీవనోపాధి
- ఇక్కడి నుంచి నెల్లూరు, గోదావరి జిల్లాలకు పయనం
- నమ్ముకున్న అటుకుల తయారీ గిట్టుబాటు కావటం లేదంటూ ఆవేదన



కార్ఖానాలో అటుకుల తయారీ చేస్తున్నది ఇలా...



పొయ్యి నుంచి అటుకులు తయారు చేస్తూ...

తెనాలి: ప్రకాశం జిల్లా... ఒకప్పుడు వరి బియ్యం అరుదైన ప్రాంతం. అక్కడి నుంచే వరి పండించే డెల్టాలోని వివిధ జిల్లాలకు అటుకుల తయారీదారుల ఉపాధి వలస ఆరంభమైంది. పంట సీజన్ల వారీగా డెల్టాలోని జిల్లాల్లో ఎంచుకున్న గ్రామాల్లో అటుకుల తయారీని చేపడతారు. ఈ సంప్రదాయం రెండు తరాలుగా కొనసాగుతోంది. వారిలో కె.వెంకటేశ్వరరెడ్డి ఒకరు. ఖరీఫ్ ధాన్యం చేతికొచ్చే టైముకు ఏటా భార్యతో సహా తెనాలి వచ్చేస్తారు. మూడు నెలలపాటు చేతినిండా పనితో ఉపాధిని పొందుతారు. ఈ క్రమంలో ప్రస్తుతం తెనాలిలో అటుకుల తయారీలో బిజీగా ఉన్నారు.

➡ స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషను, లక్ష్మీ కాంప్లెక్సు థియేటరు మధ్యభాగంలో ఓ చిన్న రేకుల షెడ్డు. అందులో కొలిమి... అటుకుల తయారీచేసే యంత్రం.. కొలిమిలోంచి వేడిసెగలు కక్కుతుంటే నాన బెట్టిన ధాన్యాన్ని మిషనులో వేసి అటుకుల తయారీ చేస్తున్నారు వెంకటేశ్వరరెడ్డి. అతడికి భార్య, మరొక సహాయకుడు పనిలో చేదోడుగా ఉన్నారు. రైతులు ఇంట్లో నానబెట్టి తీసుకొచ్చిన ధాన్యాన్ని మానిక రూ.20 చొప్పున అటుకులు చేసి ఇస్తున్నారు.

➡ అతడితో మాట కలిపితే 'మాది ప్రకాశం జిల్లా అండీ' అన్నాడు. అక్కడి నుంచి ఇక్కడకు రావటం ఎందుకని ప్రశ్నిస్తే..? 'అటుకులు చేసే వారంతా మా ఊర్లో కదండీ... అన్నాడు. అదెలాగంటే... చెప్పుకొచ్చిన వివరాలిలా ఉన్నాయి.



కె.వెంకటేశ్వరరెడ్డి

➡ ప్రకాశం జిల్లా వెనిగండ్ల మండలంలోని కొటాలపల్లి గ్రామం వెంకటేశ్వరరెడ్డి స్వస్థలం. ఆ గ్రామంతోపాటు అదే మండలంలోని అట్టవారిపల్లె, గుర్వాజి పేట గ్రామాల్లోనే దాదాపు వందకుపైగా అటుకుల తయారీ మిషన్లు ఉన్నాయి. ఏటా నెల్లూరు, గుంటూరు, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో అటుకుల తయారీకి ఇక్కడ్నుంచే వెళుతుంటారు. గోదావరి జిల్లాల నుంచి నెల్లూరు జిల్లా వరకు ధాన్యం పంట చేతికొచ్చే సమయాల్లో వ్యత్యాసాలుంటాయి. ఆ ప్రకారం వారు ఆయా జిల్లాలకు వెళుతుంటారు. రెండు నుంచి మూడు నెలల వరకు కొత్త ధాన్యాన్ని అటుకులు చేసిస్తుంటారు. సొంతంగానూ కొన్ని వడ్లు రైతుల దగ్గర కొనుగోలు చేస్తారు. వాటిని అటుకులు చేసి, అమ్ముతుంటారు.

➡ అలా వివిధ జిల్లాలకు వెళుతుండే వారిలో వెంకటేశ్వరరెడ్డి ఒకరు. ఏటా డిసెంబరు నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు తెనాలిలోనే మకాం. లక్ష్మీ కాంప్లెక్సు వెనుక భాగంలో ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్డే ఆయన కార్యక్షేత్రం. గత మూడు దశాబ్దాలుగా ఆయన ఇక్కడకు వస్తున్నారు. ముందుగా గుంటూరు జిల్లా తర్వాత రబీ సీజనుకు పంటనాటికి నెల్లూరు ఏరియాలో, ఖరీఫ్ పంట దిగుబడులు వచ్చే ఆగస్టు నాటికి గోదావరి జిల్లాలకు వెళతారు. ఒక్కోచోట మూడు నెలలు చొప్పున ఏడాదిలో తొమ్మిది నెలలు అటుకుల తయారీతోనే జీవనం సాగిస్తున్నారు.

➡ తన సొంతూరు కొటాలపల్లిలోనే 20 మిషన్లు ఉన్నాయని చెప్పారు వెంకటేశ్వరరెడ్డి. 'మాకన్నా ముందు తరం వారు అటుకుల తయారీని వృత్తిగా చేపట్టారు... అప్పట్లో మా జిల్లాలో వడ్లు పండేవి కావు. వడ్లు పండే డెల్టా ప్రాంతానికి వచ్చేవాళ్లు. ఆ దారిలోనే మేం కూడా వస్తున్నాం. మాది రెండో తరం... మొదటి తరం వాళ్లు ఇప్పుడెవరూ లేరు' అన్నారు. ధాన్యం నంబర్ల సాగు తగ్గిపోయింది. ఎక్కువశాతం బీపీటీ రకం వరి పండిస్తున్నారు. ఈ బియ్యాన్ని అటుకులు పట్టివ్వటం తగ్గిపోయిందని చెబుతున్నాడు.

➡ ఎన్నో దశాబ్దాలుగా నమ్ముకున్న అటుకుల తయారీ వ్యాపారం గిట్టుబాటు కావటం లేదంటారు వెంకటేశ్వరరెడ్డి. కట్టెలు, పొట్టు, ఆయిల్ ఖర్చులు ఏటా పెరుగుతున్నాయి. అటుకుల మరాడిస్తే ఇచ్చే ధర మాత్రం పెరగటం లేదు. గత నాలుగేళ్లుగా మానికకు రూ.20 మాత్రమే తీసుకుంటున్నారు. ఈ పనికి ముగ్గురు మనుషులుండాలి... నేనూ, మా ఆవిడా ఇద్దరం పనిచేస్తున్నాం... ఇంకో మనిషిని మాత్రమే పెట్టుకున్నాం. కాబట్టే ఆమాత్రం చేయగలుగుతున్నాం. రూ.లక్ష పని ఆడితే, రూ.20 వేలు మిగలటం లేదు.. ఇద్దరూ బయటోళ్లని పెట్టుకుంటే నష్టపోవటం మినహా చేతికొచ్చేదేం ఉండదని నిష్కర్షగా చెప్పాడు.

'మా జిల్లా అటుకుల తయారీదారుల్లో ఐకమత్యం లేదండీ... అటుకులకు తీసుకునే రూ.20 ధర పెంచటానికి అందరూ ఒప్పుకున్నా, ఒకళ్లిద్దరు అంగీకరించ లేదు.. గత్యంతరం లేక మేం కూడా ఆ డబ్బులే తీసుకుంటున్నాం' అని వివరించాడు.

సంక్రాంతి బరిలో కనిపించని చిన్న సినిమాలు

- ప్రతి నెలలో ఒక వారం చిన్న సినిమాలకు అవకాశం
- మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా వినతి

తెనాలి: సంక్రాంతికి విడుదల అయిన సినిమాలన్నీ రూ.వంద కోట్ల బడ్జెట్‌పైనే నిర్మాణ వ్యయం కలిగినవనీ, సంక్రాంతి బరిలో ఒక్క చిన్న సినిమా కూడా లేకపోవటం దురదృష్టకరమని 'మా–ఏపీ' వ్యవస్థాపకుడు/ సినీ దర్శకుడు దిలీప్ రాజా విచారం వ్యక్తంచేశారు. చిన్న సినిమాలు తీవ్రమైన నిరాదరణకు గురయ్యాయని గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మంచి కథ, స్క్రీన్‌ప్లేతో రూపొందిన చిన్న సినిమాలు విడుదలకు నోచుకోకపోవటంలోని లోపాలను ప్రభుత్వం సరిచేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రికి నివేదిస్తామని దిలీప్ రాజా పేర్కొన్నారు. ప్రతి మాసంలో మూడువారాలు పెద్దసినిమాలకు కేటాయించినా కనీసం ఒక వారం రోజులు చిన్న సినిమా విడుదలకు అవకాశం కల్పించే దిశగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమస్యకు శాశ్వత ప్రాతిపదికన చర్యలను తీసుకోవలసిందిగా ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు.

అమరావతిలో పొలం విక్రయం పేరిట మోసం

పోలీసుల కేసు నమోదు

తెనాలిరూరల్: రాష్ట్ర రాజధాని ప్రాంతమైన అమరావతిలో పొలం విక్రయించే పేరిట మోసానికి పాల్పడినవారిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణ ఐతానగర్‌కు చెందిన నక్కా కృష్ణ, అతని కొడుకు శివకుమార్, కుమార్తె మంచాల మహలక్ష్మి సేలంకు చెందిన జయరాజ్‌కు పొలం విక్రయిస్తామని చెప్పారు. రాజధాని ప్రాంతంలో పొలం ఉందని 2023 నుంచి పలు దఫాల్లో రూ. 86 లక్షలు తీసుకున్నారు. ఏళ్లు గడుస్తున్నా పొలం విక్రయం/రిజిస్ట్రేషన్ జరుగకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. టూ టౌన్ పోలీసులు కేసు గురువారం నమోదు చేశారు.

లక్ష్యాన్ని ఛేదించాలంటే ఏకాగ్రత ముఖ్యం

ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: లక్ష్యాన్ని సాధించాలంటే ఏకాగ్రత ముఖ్యమని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు చెప్పారు. రూరల్ గ్రామం కొలకలూరు బీజేఆర్ రీడింగ్ రూమ్ పొన్నెకంటి బెంజమిన్ ప్రాంగణంలో ఆది జాంబవ దళిత్ ఎంప్లాయిస్ సేవా సమితి (డెస్క్) ఆధ్వర్యంలో కెరీర్ ఆపర్చునిటీస్‌పై ఈనెల 12 నుంచి నిర్వహించిన అవగాహన సభ గురువారంతో ముగిసింది. ఐటీసీఎల్ డీలర్ యడ్లపల్లి రవికిరణ్ సారథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ తరగతి గదిలో విద్యార్థులు చూడడం, వినడం, సంబంధిత పాఠ్యాంశంపై మాట్లాడటం, ఆలోచించడం అనే నాలుగు అంశాలపై మాత్రమే దృష్టి కేంద్రీకరించాలన్నారు. అట్టడుగు వర్గాల్లో పుట్టి ఐఏఎస్, ఐపీఎస్‌లో టాపర్లుగా నిలిచిన వారిని, సైంటిస్టులుగా ఎదిగిన వారిని ఆదర్శంగా తీసుకొని లక్ష్యసాధనలో ముందడుగు వేయాలని సూచించారు. గ్రామంలో కరుణానిలయం విద్యాసంస్థల వ్యవస్థాపకులు పొన్నెకంటి బెంజమిన్ పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ముగింపు సభలో తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని వ్యాసరచనలో విజేతలైన వారికి, అదేవిధంగా మూడు రోజుల శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు డెస్క్ తరఫున ప్రోత్సాహక బహుమతులను అందించారు. కార్యక్రమంలో గుంటూరు ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ కోటేశ్వరరావు, సీనియర్ ఏపీపీ ఎస్ఎస్ఎస్ సుకుమార్, ఎల్ఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ జి.ప్రవీణ్ కుమార్ శ్యామ్, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు సిద్దెల కమలాకర్, పి. లక్ష్మయ్య, శరత్ వెంకయ్య, న్యాయవాది ఎస్. మురళీధర్, ఎస్.వినయ్ కుమార్, పి.సాంబశివరావు, ఎస్.శ్రీనివాస్, ఎస్.అంబేడ్కర్, కె. మోజెస్, వీఆర్వో కె.జార్జి థామస్, రావూరి శ్యామ్ విద్యార్థులు పాల్గొన్నారు.

20న తెనాలిలో కోల్డ్‌స్టోరేజీ బాధిత రైతుల ధర్నా



సమావేశంలో రైతులతో మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

తెనాలి: దుగ్గిరాలలోని శుభమ్ మహేశ్వరి కోల్డ్ స్టోరేజీ అగ్నిబాధిత పసుపు రైతులకు ఏడాది గడుస్తున్నా పరిహారం ఇవ్వనందుకు నిరసనగా ఈనెల 20న పట్టణ మారీసుపేటలోని న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్నా శివశంకరరావు ఈ విషయాన్ని తెలియజేశారు. గురువారం సాయంత్రం తెనాలిలోని ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యాలయంలో పసుపు రైతుల ముఖ్యులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు ములకా శివసాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. శివశంకరరావు మాట్లాడుతూ నష్టపోయిన పసుపు రైతులకు ప్రభుత్వం తరపున క్వింటాలుకు రూ.7 వేలు ఇప్పిస్తాం...బాధ్యత తమదేనని చెప్పిన వ్యవసాయశాఖ మంత్రి జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. రూ.80 కోట్ల విలువైన 1.04 లక్షల బస్తాల పసుపు బూడిదైందని గుర్తుచేశారు. అటు వరదలు, ఇటు అగ్నిప్రమాదం కారణంగా పసుపు రైతులు నష్టపోయినా, ఇన్సూరెన్స్ అధికారులు స్పందించకపోవటం అన్యాయమన్నారు. బాధిత పసుపు రైతుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం పట్టించుకోలేదనీ, ప్రస్తుత ప్రభుత్వం చుట్టూ తిరుగుతున్నాగానీ సమస్య పరిష్కారానికి నోచుకోవటం లేదన్నారు. పసుపునకు మంచి ధర వస్తుందన్న ఆశతో కొన్నేళ్లుగా ఇన్సూరెన్స్ ప్రీమియం, వడ్డీలు చెల్లించిన రైతులు ఆశలు ఆడియాసలు కాకుండా చూడకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో భీమవరపు చిన్నరామిరెడ్డి, వై.వెంకటేశ్వరరావు, పోతురాజు కోటేశ్వరరావు, జెట్టి బాలరాజు, వై.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

స్మారక ప్రతిభా పురస్కారాల పంపిణీ



పురస్కారాలను అందుకున్న విద్యార్థులు

తెనాలి: రూరల్ మండలం గుడివాడకు చెందిన ఈదర విజయలక్ష్మి స్మారక సేవాసమితి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం గురువారం తెనాలిలో నిర్వహించారు. ఈదర విజయలక్ష్మి 21వ వర్ధంతి సందర్భంగా గాంధీనగర్‌లోని జాతీయ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజెళ్ల ఉమామహేశ్వర్ నివాస ప్రాంగణంలో ఏర్పాటైన సభలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ట్రిపుల్ ఐటీలో చేరిన విద్యార్థినీ విద్యార్థులకు రూ.2 వేల చొప్పున పారితోషికాన్ని ఈదర వెంకట పూర్ణచంద్ బహూకరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, మానవత చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహిస్తూ గత 21 సంవత్సరాలుగా ప్రతిభావంతులకు ట్రస్టు ద్వారా ఉపకార వేతనాలు అందజేస్తున్న ఈదర వెంకట్రావు కుటుంబ సభ్యులను అభినందించారు. అధ్యక్షత వహించారు. ట్రస్టు అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు మాట్లాడుతూ ఈదర విజయలక్ష్మి స్వగ్రామమైన గుడివాడ గ్రామంలో ఈ కార్యక్రమం చేపట్టామని చెబుతూ, గత 14 సంవత్సరాలుగా మండల స్థాయిలో ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ తెనాలిలో నిర్వహిస్తున్నామని అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, సీఆర్‌పీ చల్లగాలి శ్రీదేవి పలువురు గుడివాడ గ్రామప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు. నగదు పారితోషికాలను షేక్ నేహా పర్వీన్ (సంగంజాగర్లమూడి), పి.రాధాచంద్రిక (ఖాజీపేట), పి.రూపశ్రీ (బాలికల పాఠశాల) షేక్ నాగూర్ షరీఫ్ (ఎస్‌సీఆర్ఎస్ఎం, హైస్కూలు) అందుకొన్నారు. వేజళ్ల ఉమామహేశ్వర్ పర్యవేక్షించారు.

బుర్రా జయలక్ష్మికి మాతృ వియోగం



తెనాలి: పట్టణానికి చెందిన సుప్రసిద్ధ రంగస్థల నటీమణి, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మికి మాతృవియోగం కలిగింది. ఆమె తల్లి పిన్ని పిచ్చమ్మ (94) బుధవారం నందులపేటలోని స్వగృహంలో మృతిచెందారు. ప్రముఖ సినీ సంభాషణల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా పిచ్చమ్మ మనుమడు. గురువారం ఆమె అంత్యక్రియలను పూర్తిచేశారు. కళాకారుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గరికపాటి సుబ్బారావు, అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, కనపర్తి మధుకర్, దేవరపల్లి భవానీ, మోహనరావు, అయినాల మల్లేశ్వరరావు, వెంకటేశ్వరరావు, విజయ్, కొండముది రమేష్‌బాబు తదితరులు పిచ్చమ్మకు నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సంతాపం తెలియజేశారు.

భరతమాతకు పూజలు

నగరం: దేశభక్తిని పెంపొందించేందుకే భరతమాతకు పూజలు చేస్తున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ జంజనం హేమ శంకర్రావు చెప్పారు. మండలంలోని పెద్దవరం గ్రామ పంచాయతీ, రామాలయాల వద్ద గురువారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భరతమాత చిత్రపటం ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా హేమ శంకర్రావు మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా ప్రతిగ్రామంలో భరతమాతకు పూజలు చేసి స్వాతంత్య్ర సమరయోధులు గూర్చి తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ధర్మప్రచారక్ చింతల మురళీకృష్ణ, వాకా శ్రీనివాసరావు, సజ్జా సరస్వతి పాల్గొన్నారు.

కన్నెగంటివారిపాలెంలో...

భట్టిప్రోలు (కొల్లూరు): రిపబ్లిక్ డే పురస్కరించుకొని భరతమాతకు పూజలు చేపట్టనున్నట్లు జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు గురువారం తెలియజేశారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కన్నెగంటివారిపాలెంలోని శ్రీరామాలయంలో పూజా కార్యక్రమాలు రిపబ్లిక్ డే వరకు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. బోయపాటి శివప్రసాద్, బోయపాటి శ్రీనివాసరావు, కొడూరు శ్రీనివాసరావు, కన్నెగంటి నాగేశ్వరరావు, వరికూటి నాగమల్లేశ్వరరావు, చెట్టిమ్మ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ గంగాధర్‌కు డాక్టర్ గణేష్ పరామర్శ



రేపల్లె రూరల్: కామరాజుగడ్డ నార్త్ పంచాయతీ సర్పంచ్ ఉయ్యూరు గంగాధరరావు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స పొందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ గురువారం గంగాధర్‌ను కలిసి పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని గంగాధర్ కుటుంబానికి అండగా ఉంటానని హామీనిచ్చారు. పరామర్శించిన వారిలో పార్టీ రేపల్లె రూరల్, చెరుకుపల్లి మండల కన్వీనర్‌లు మేడికొండ అనిల్, దుండి వెంట రామిరెడ్డి, నాయకులు బొర్రా శ్రీనివాసరావు, ఉయ్యూరు కిట్టయ్య తదితరులున్నారు.

సంస్కరణోద్యమ సారథి 'కవిరాజు'

వర్ధంతి రోజున కళారంగ ప్రముఖుల నివాళి



కవిరాజు రామస్వామి విగ్రహానికి పుష్పాంజలి

తెనాలి: తెలుగులో సాంస్కృతిక విప్లవానికి నాందీ పలికిన శంభూకవధతో సహా అనేక రచనలు చేసిన కవిరాజు త్రిపురనేని రామస్వామి రాష్ట్రంలో సంస్కరణోద్యమానికి సారథిగా వివిధ ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు. తెనాలిలోని సూతాశ్రమం కార్యక్షేత్రంగా హేతువాద సమరాన్ని కొనసాగించిన త్రిపురనేని రామస్వామి వర్ధంతి రోజైన గురువారం సాయంత్రం ఇక్కడి గాంధీనగర్‌లోని కవిరాజ పార్కులో గల ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు మాట్లాడుతూ బాల్యంలో ఎదుర్కొన్న వివక్షతో తెలుగు, ఇంగ్లిష్, సంస్కృతం భాష్యలు అధ్యయనం చేసిన రామస్వామి చౌదరి నాటి సామాజిక వ్యవస్థపై తిరుగుబాటు జెండా ఎగురవేశారని చెప్పారు. కృష్ణాజిల్లా అంగలూరులో జన్మించి, ఐర్లండ్‌లో బారిష్టరు చదివిన రామస్వామి, 'రైతు'దినపత్రికకు సంపాదకుడిగా వచ్చిన ఆహ్వానంతో 1922లో తెనాలికి మకాం మార్చారని, అప్పటి నుంచి ఆయన జీవితయాత్రకు తెనాలి రంగస్థలమైందని చెప్పారు. న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూనే సంస్కరణోద్యమాన్ని చేపట్టారనీ, అనేక రచనలు చేశారని తెలిపారు. ముఖ్యంగా పురాణాలను తూర్పారబట్టారని చెప్పారు. రెండుసార్లు మున్సిపల్ చైర్మన్‌గా చేసి కొలుపుల్లో జంతుబలులను నిషేధించినట్టు తెలిపారు. వివాహాల్లో మంత్రతంత్రాలకు మంగళం పాడించి 'వివాహవిధి'ని అచ్చతెలుగులో విస్తృతంగా వ్యాప్తి చేశారని గుర్తుచేశారు. ఆయన సంస్కరణోద్యమ బాట నేటితరానికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. అభ్యుదయ కళా సమితి నాయకుడు బెల్లంకొండ వెంకట్, గుర్రం జాషువా విజ్ఞానసమితి ప్రధాన కార్యదర్శి పినపాటి రవికుమార్, కొండముది రమేష్‌బాబు, బాల సాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని, కన్నెగంటి మధు, చందు సూర్య, వెటరనరీ ప్రసాద్ తదితరులు రామస్వామి విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటించిన వారిలో ఉన్నారు.

రోడ్డు భద్రత పాటించడం అందరి బాధ్యత

రోడ్డు భద్రతా మాసోత్సవ సభలో తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు



అతిథులను సత్కరించిన డిపోమేనేజరు ఎ.రాజశేఖర్

తెనాలి: రోడ్డు భద్రతను పాటించటం అనేది ప్రతిఒక్కరి బాధ్యతగా తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు అభిప్రాయపడ్డారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం ప్రమాదానికి హేతువు కాగలదని హెచ్చరించారు. ఏదైనా వాహనాన్ని ఓవర్‌టేక్ చేసేటప్పుడు ఎదురువచ్చే వాహనం, వెనుక నుంచి దూసుకొచ్చే వాహనాలను గమనంలోకి తీసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం తెనాలి ఆర్టీసీ డిపోలో ఏర్పాటైన సమావేశానికి డిపో మేనేజరు ఎ.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. డీఎస్పీ జనార్ధనరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు బస్సులో ప్రయాణీకులు, వారి కుటుంబాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకోవాలని చెప్పారు. నిబంధనలను పాటిస్తూ డ్రైవింగ్ చేసినట్టయితే ప్రయాణీకులకు సురక్షిత ప్రయాణం సాధ్యపడుతుందని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ జనాభా పెరిగినా అందుకనుగుణంగా రోడ్ల విస్తరణ జరగలేదని గుర్తుచేశారు. చాలా జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలనీ, బస్సులను ప్రయాణికుల కోసం ఆపునప్పుడు వెనక వచ్చు వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా బాగా ప్రక్కకి తీసి ఆపాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని రోడ్ల వెడల్పుకు తన వంతు కృషిచేస్తానని చెప్పారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా చెప్పారు. బస్సులను రోడ్డుపై అకస్మాత్తుగా ఆపరాదనీ, ఎదురుగా, వెనుకగా వచ్చే వాహనాలను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మోటారు వాహనాల అధికారి టి.రాఘవరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు హెచ్చుగా ఉంటున్నాయని, ఆయా ప్రమాదాల్లో చనిపోయిన వారి కుటుంబాలు, క్షతగాత్రుల కుటుంబాలు పరిస్థితి చాలా బాధాకరంగా ఉంటుందన్నారు. అప్రమత్తంగా డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల నివారణకు ప్రతివారూ కృషిచేయాలని సూచించారు. డిపోమేనేజరు ఎ.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. సభలో అతిథులను సత్కరించారు. సీఐ శ్రీరాములనాయక్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఐజే ప్రసాదరావు, మెకానికల్ ఇంజనీర్ అభిరామ్‌నాయక్, అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.